## క్లుప్తంగా

### నిరుపేదల జీవితాల్లో వెలుగులు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిరుపేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు క్లో లలిత ట్రస్ట్ కృషి చేస్తోందని ఆ ట్రస్ట్ వ్యవస్థాపకులు క్లో నాగేశ్వరరావు అన్నారు. స్థానిక 59వ డివిజన్ సింగ్‌నగర్ రైతుబజార్ వద్ద ఆ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేదలకు శనివారం అన్నసమారాధన, పండ్ల పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ క్లో లలిత ట్రస్ట్ పేరుతో ప్రతి నెలా 12వ తేదీన జిల్లా వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. మాజీ కార్పొరేటర్ చందన సురేష్, ముప్పూరి హరీష్, లాపాటి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

### రెప్కో బ్యాంక్ నూతన డిపాజిట్ పథకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వినియోగదారులకు కోసం రెప్కో బ్యాంక్ (భారత ప్రభుత్వరంగ సంస్థ) నూతన డిపాజిట్ పథకాన్ని ప్రవేశపెట్టిందని ఆ బ్యాంక్ డీజీఎం బద్రినారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ డిపాజిట్ స్కీమ్‌లో సీనియర్ సిటిజన్లకు 8.25 శాతం వడ్డీ, ఇతరులకు 7.75శాతం వరకు వడ్డీ రేటు అందిస్తోందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

### 21నుంచి కుట్టు శిక్షణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 21వ తేదీ నుంచి టైలరింగ్‌లో కొత్త బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభిస్తున్నామని ఎం.బి.విజ్ఞాన కేంద్రం మహిళా విభాగం ఇన్‌చార్జి పి.విజయ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికి టైలరింగ్‌లో 8 బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేశామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 19వ తేదీ లోగా ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 0866 2578044, 94900 98021 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### వేగంగా రోడ్డు పనులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇటీవల కురిసిన వర్షాలకు గోతులు పడిన దావు బుచ్చయ్యకాలనీ, జీవీఆర్‌నగర్ రోడ్ల మరమ్మతులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రజలు ఇబ్బంది పడకుండా గోతులను సరి చేస్తున్నారు. పనులను కార్పొరేటర్ బీహెచ్‌ఎస్‌వీ జానారెడ్డి పరిశీలించారు.

### ఆహార పొట్లాల పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): దక్ష ఫౌండేషన్ ఆధ్వర్యాన నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం నిరుపేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు గోదావరి వెంకటేష్ మాట్లాడుతూ ఫౌండేషన్ సభ్యులు, దాతల సహకారంతో నిరుపేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్నామన్నారు.

### మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులను అరికట్టాలి



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని పాస్టర్ పి.కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మణిపూర్‌లో జరిగిన దాడులకు నిరసనగా సింగ్‌నగర్ ఎల్లద్దాయి గాస్పెల్ చర్చి ఆధ్వర్యంలో శనివారం శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవ విశ్వాసులు ప్లకార్డులతో సింగ్‌నగర్ పీఅండ్‌టీ కాలనీ నుంచి కృష్ణాహోటల్ సెంటర్ వరకూ ర్యాలీ చేశారు.

### ప్రజాసేవలో భాగస్వాములు కావాలి

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక కళా సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. పోలీస్ శాఖలో పని చేస్తున్న శరాబందిరావుకు యూకేకు చెందిన హోప్ టెక్నాలజీ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ఇచ్చిన సందర్భాన్ని పురస్కరించుకొని నగరంలోని వివిధ లయన్స్ క్లబ్ శాఖల ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో అభినందన సభను ఏర్పాటు చేశారు. విజయవాడ లయన్స్‌క్లబ్ బాధ్యుడు కొల్లూరి, శంకర్ గుప్తా, వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్ అరవ సత్యం, మాజీ డీసీపీ సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారుజ నిర్వాహకులు శరాబందిరావు, దంపతులను ఆత్మీయంగా సత్కరించారు.

# జయహో జగజ్జనని



ఇంద్రకీలాద్రిపై దుర్గగుడిలో భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): జయహో జగజ్జనని అంటూ భక్తజనం కనకదుర్గమ్మను కనులారా దర్శించుకుని మనసారా ప్రార్థించారు. రెండో శనివారం, ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని ఇంద్రకీలాద్రికి భక్తుల తాకిడి పెరిగింది. సర్వ దర్శనానికి రెండు గంటల సమయం పట్టగా, రద్దీ నేపథ్యంలో భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఇన్‌చార్జ్ ఈవో కోటేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**ఆర్జిత సేవల్లో ఉభయదాతలు**

అమ్మవారికి నిర్వహించిన ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీహోమాల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. వారిని ప్రత్యేక క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి అనుమతించారు. మరో వైపున ఘాట్‌రోడ్డు, మహామండపం లిఫ్టు, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులు సర్వ దర్శనంతో పాటు రూ. 100, రూ. 300,రూ. 500 టికెట్లు కొనుగోలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. రద్దీ నేపథ్యంలో అమ్మవారికి భక్తులు సమర్పించే చీరల కౌంటర్‌ను చైర్మన్ కర్నాటి రాంబాబు తనిఖీ చేశారు. భక్తులు ఇచ్చిన ప్రతి చీరకు తప్పని సరిగా రసీదు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు.

## గద్దర్ మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

**సంస్మరణ సభలో వక్తలు**



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజా యుద్ధనౌకగా పేరొందిన గద్దర్ మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని వక్తలు పేర్కొన్నారు. శనివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యాన రచయిత, కళాకారుడు, వాగ్గేయకారుడు గుమ్మడి విఠల్ రావు( గద్దర్ )సంస్మరణ సభ జరిగింది. తొలుత గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాకారులు గద్దర్ పాటలు పాడి నివాళులర్పించారు. ఏఎన్‌యూ ఆచార్యులు చల్లపల్లి స్వరూపరాణి మాట్లాడుతూ గద్దర్ జీవితంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నారన్నారు. సంస్మరణ సభలో తంగిరాల సోని (బహుజన రచయితల వేదిక), మోతుకూరి అరుణ్‌కుమార్ (అరసం), శిఖా పేరురి మురళి కుమార్, ఎస్.ఎస్.సి బోస్ (పౌర హక్కుల సంఘం), శిఖా ఆకాష్, మల్లెల వెంకట్రావు, పంతగాని రమేష్ (ఏ బి ఎస్ పార్టీ), కృష్ణ (దళిత మహాసభ) కొరబండి బాబురావు, ఆర్.పిచ్చయ్య, ఆంధ్ర మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 8 నుంచి శ్రీ వైభవ మహాలక్ష్మీయాగం



యాగం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): దేశ సంరక్షణ, సౌభాగ్యం, ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ శ్రావణమాసం నాలుగో శుక్రవారం సెప్టెంబర్ 8 నుంచి 13వ తేదీ వరకు సింగ్‌నగర్‌లోని బసవపున్నయ్య స్టేడియంలో శ్రీ వైభవ మహాలక్ష్మీయాగం నిర్వహించనున్నట్లు యాగం కన్వీనర్ కె.ఎస్. దీక్షితులు పేర్కొన్నారు. సత్యనారాయణపురంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఓకే సిల్క్స్ ప్రతినిధి వర్ల శ్యాంప్రసాద్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దీక్షితులు మాట్లాడుతూ శ్రీ శివజ్ఞాన పీఠాధిపతులు శివాచార్యస్వామి సమక్షంలో శ్రావణ శుక్రవారం నుంచి మొదలయ్యే ఈ యాగంలో రోజూ మహిళలతో సామూహిక కోటి రేణువుల కుంకుమార్చన, హోమ కార్యక్రమాలు, వెండి కమల పుష్పార్చన, సాయంత్రం భక్తులతో సామూహిక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం యాగ స్థలం పురవీధుల్లో ఊరేగింపు, స్వామి వారి అనుగ్రహ భాషణం జరుగుతుందన్నారు. యాగం చివరి రోజున ఉదయం 11.25 గంటలకు యాగ పూర్ణాహుతి నిర్వహించి మధ్యాహ్నం భక్తులకు యజ్ఞ ప్రసాదం, అన్న ప్రసాద వితరణ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాగలింగం శివాజీ, పి.శ్యాంప్రసాద్, సుదర్శన్, హైమవతి తదితరులు పాల్గొన్నారు.

## బీసీల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి లైన్‌క్లియర్



కమ్యూనిటీ హాల్ నిర్మించనున్న స్థలమిదే..

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 31వ డివిజన్‌లో బీసీల చిరకాల కోరిక అయిన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి లైన్ క్లియరైంది. డివిజన్‌లో పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన బీసీలు శుభకార్యాలు చేసుకునేందుకు అవస్థ పడుతున్నారు. ఇక్కడ బీసీ కమ్యూనిటీ హాలు నిర్మించాలని ఇటీవల డివిజన్‌లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానికులు కార్పొరేటర్ పెనుమత్స శిరీష, ఎమ్మెల్యే మల్లాది విష్ణును కోరారు. జీఎస్ రాజు రోడ్డులో దోబీఖానా పక్కన నిరుపయోగంగా అసాంఘిక కలాపాలకు అడ్డాగా మారిన ప్రాంతంలో హాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన మల్లాది విష్ణు అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌన్సిల్‌లో ప్రతిపాదన చేసి తీర్మానం చేశారు. ఇప్పటికే దుర్గాపురంలో ఇచ్చిన మాట ప్రకారం రజకుల కోసం కల్యాణ మండపం నిర్మించిన ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఇప్పుడు బీసీల కోసం కమ్యూనిటీ హాలు నిర్మాణానికి సహకరించటంపై బీసీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పద్యనాటకం.. తెలుగువారి ఆత్మ



సత్యహరిశ్చంద్ర నాటకంలోని సన్నివేశం

విజయవాడ కల్చరల్: పద్యనాటకం తెలుగువారు ఆత్మ అని గుమ్మడి కళాపీఠం అధ్యక్షుడు జయరాజ్ చెప్పారు. దేవీ కళానాట్యమండలి, గుమ్మడి కళాపీఠం, సాయిహృదయా నాట్యమండలి ఆధ్వర్యంలో గాంధీనగర్ కొత్తా పూర్ణానందం వేదికపై శనివారం బలిజేపల్లి లక్ష్మీకాంత కవి రచించిన సత్యహరిశ్చంద పద్యనాటకం హృద్యంగా సాగింది. హరిశ్చంద్ర నాటకంలోని అడవి ఘట్టం, వారణాసి, కాటిసీనును కళాకారులు ప్రదర్శించారు. జయరాజ్ మాట్లాడుతూ సత్యహరిశ్చంద్ర పద్య నాటకాన్ని ఎక్కడో ఒక చోట ప్రదర్శిస్తూనే ఉంటారని తెలిపారు. గుమ్మడి అన్వేష్, మోడి ఆంజనేయులు, అగురు త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు. కళాకారులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

### డీఎస్సీ-98 అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలి

**ఎమ్మెల్సీ లక్ష్మణరావు**

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డీఎస్సీ-98 అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ ఈనెల 16న విజయవాడలో మహాధర్నా చేపట్టనున్నట్లు 1998 డీఎస్సీ పోస్టుల సాధన పోరాట కమిటీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎమ్మెల్సీ లక్ష్మణరావు , కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరించి 4072 మందికి ఓపెన్ మెరిట్ పద్ధతిలో పోస్టులు కేటాయించారన్నారు. మిగిలిన వారందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. డీఎస్సీ-98 అభ్యర్థులకు పీడీఎఫ్ ఎమ్మెల్సీలు మద్దతిస్తారన్నారు. సమావేశంలో కమిటీ రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు, పొదిలి రమణ, రమేష్ ,రత్నం తదితరులు పాల్గొన్నారు.

### మైనర్ కనిపించడం లేదని కేసు

పాయకాపురం(విజయవాడరూరల్): వాంబే కాలనీలో నివసిస్తున్న మైనర్ కనిపించడం లేదని నున్న పోలీసుస్టేషన్లో ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వాంబే కాలనీకి చెందిన సుదాబత్తుల వంశీ బావ కుమారుడు ఇనగిరి సత్యసిద్ధార్థ (గుడివాడ) వాంబేకాలనలో ఉంటూ పటమట హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 11వ తేదీన కోడిగుడ్లు తీసుకురావడానికి బయటకు వెళ్లిన సిద్ధార్థ తిరిగి రాలేదు. ఘటనపై వంశీ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

### మహిళను దుర్భాషలాడిన వ్యక్తిపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళను దుర్భాషలాడిన వ్యక్తిపై భవానీపురం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విద్యాధరపురం చెరువు సెంటర్‌కు చెందిన మహిళ అమ్మవారి గుడిలో పని చేస్తోంది. ఆమె భర్త ఏడేళ్ల క్రితం మరణించాడు. మూడేళ్ల క్రితం ఇంటి పక్కనే ఉంటున్న చింతపల్లి చంద్రశేఖర్‌తో పరిచయం ఏర్పడింది. కొంత కాలం నుంచి ఆమె చంద్రశేఖర్‌తో మాట్లాడటం లేదు. దీంతో అతను ఇంటికి రావడం, ఆమె ఎక్కడికి వెళితే అక్కడి వెళ్లి వేధిస్తున్నాడు. తన ఇంటికి రావద్దని చెప్పినా వినకుండా ఆమెను మానసికంగా వేధిస్తున్నాడు. శనివారం ఉదయం 11 గంటల సమయంలో ఇంటికి వచ్చి ఆమెను నానా దుర్భాషలాడాడు. కొట్టేందుకు మీదికి వచ్చాడు. దీంతో ఆమె భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. చంద్రశేఖర్‌తో తనకు, తన పిల్లలకు రక్షణ లేదని, అతని నుంచి రక్షించాలని ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

### రేపు మాస శివరాత్రి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో 14 తేదీ సోమవారం శ్రీధర్మపరిషత్ మహాసంస్థాన్ ఆధ్వర్యాన మాస శివరాత్రి పూజలు నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రుద్రాభిషేకం, ఇతర ప్రత్యేక పూజలు జరుగుతాయని పేర్కొన్నారు.

## కష్టజీవులకు అండగా జగనన్న ప్రభుత్వం



చర్మకారులకు గొడుగులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కష్టజీవులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని ప్లానింగ్ బోర్డు వైస్‌చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. లిడ్ క్యాప్ డైరెక్టర్ ఎం.ఝాన్సీరాణి ఆధ్వర్యాన నగరంలోని చర్మకారులకు గొడుగులు పంపిణీ కార్యక్రమాన్ని సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని ఎమ్మెల్యే విష్ణు కార్యాలయంలో శనివారం నిర్వహించారు. విష్ణు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో డీబీటీ పథకాల ద్వారా 46.76 లక్షల మంది మాదిగలకు నేరుగా రూ.16,650 కోట్ల లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. ఇవికాక నాన్ డీబీటీ పథకాల ద్వారా మరిన్ని ప్రయోజనాలు చేకూరుస్తున్నట్లు వెల్లడించారు. నగరంలోని చర్మకారుల సమస్యలను గుర్తించి వారు ఎండకు, వానకు ఇబ్బంది పడకుండా గొడుగులు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. నేతలు కంభగళ్ల రాజు, కోలా శాంతకుమారి, కిషోర్, అంబోజి శ్రీనివాస్, డి.కోటేశ్వరరావు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ రంగ బ్యాంకులను రక్షించుకుందాం

**కెనరా బ్యాంకు ఉద్యోగుల సంఘ జాతీయ సమావేశంలో ఎంపీ బినయ్ బిశ్వం**

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వ రంగ బ్యాంకులను రక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని పార్లమెంటు సభ్యులు బినయ్ బిశ్వం అన్నారు. విజయవాడలో మూడు రోజుల పాటు జరగనున్న కెనరా బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ జాతీయ 26వ సర్వసభ్య సమావేశాలు శనివారం ప్రారంభమయ్యాయి. పోరాటాల పురిటిగడ్డ విజయవాడలో 1974లో సమావేశాలు జరగ్గా, 49 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు జరుగుతున్నట్లు ఆ సంఘ కేంద్రకమిటీ అధ్యక్షులు ఎంఎస్ శ్రీనివాసన్ తెలిపారు. సమావేశాల్లో ముఖ్యఅతిథులుగా ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం, కార్యదర్శి బీఎస్ రాంబాబుతో పాటు కెనరాబ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సత్యనారాయణరాజు, జనరల్ మేనేజర్ పి రవివర్మ, ఉపాధ్యక్షుడు జెపీ శర్మ, కెనరా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.శ్రీకృష్ణ పాల్గొన్నారు.

## 15న 'జయహో భారత్'



ఆర్ట్ కంటెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): కళలను, కళాసంస్కృతిని కాపాడుకోవడంతో పాటు చిన్నారుల్లో దేశభక్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ నెల 15వ తేదీ జయహో భారత్... ప్రౌడ్ టూ బీ ఏన్ ఇండియన్ పేరుతో ఆర్ట్ కంటెస్ట్ నిర్వహిస్తున్నామని టాప్మోర్ లెర్నింగ్ ప్రయివేట్ లిమిటెడ్ సీఈవో పద్మలత చెప్పారు. నగరంలోని ఆ సంస్థ కార్యాలయంలో శనివారం ఆర్ట్ కంటెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. పద్మలత మాట్లాడుతూ ఫోరం ఫర్ ఆర్టిస్ట్, మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం(ఎంబీవీకే) తమ సంస్థ సంయుక్త ఆధ్వర్యాన పోటీలు జరుగుతున్నాయన్నారు. సబ్ జూనియర్స్ (1, 2, 3 తరగతులు), జూనియర్స్ (4 , 5, 6 తరగతులు), సీనియర్స్ (7, 8, 9 తరగతులు) విభాగాల్లో పోటీలుంటాయని ఫోరం ఫర్ ఆర్టిస్ట్ కన్వీనర్ ఎ.సునీల్ కుమార్ తెలిపారు. ఎంజీరోడ్డులోని మాకినేని బసవన పున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబీవీకే) ఆవరణలో జరిగే కంటెస్ట్‌కు ప్రవేశం ఉచితమని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 77993 08775, 79814 35393 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ 'ఏ' గ్రేడ్



ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రతిష్టాత్మకమైన నాక్ ఏ గ్రేడ్ లభించింది. 2017లో నాక్ బీ ప్లస్ గ్రేడ్ ఉండగా ఇప్పుడు అత్యుత్తమ పనితీరు, మెరుగైన వసతుల కల్పన విద్యాబోధనలతో ఏ గ్రేడ్ సొంతమైంది. 86 సంవత్సరాల చరిత్ర కలిగిన ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ ఏగ్రేడ్ గుర్తింపు రావడంపై కళాశాల సిబ్బంది, పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిష్టాత్మకమైన ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ కళాశాలలో మారుతున్న కాలానుగుణంగా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో వసతులు కల్పించారు. ఇప్పటికే అటానమస్ హోదా కలిగిన కళాశాలలో వర్చువల్ క్లాస్ రూమ్‌లతో పాటు, సీసీ కెమెరాలు, అత్యాధునిక ల్యాబ్, లైబ్రరీలను ఏర్పాటు చేశారు. కళాశాలలో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో ఇటీవల జరిపిన నాక్ పర్యటనలో ఏ గ్రేడ్ లభించింది.

## విశ్వరూప మహాసభను విజయవంతం చేయండి

**ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ**

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎస్సీ వర్గీకరణ కోరుతూ త్వరలో హైదరాబాద్‌లో మాదిగల విశ్వరూప మహాసభ నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ తెలిపారు. మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మాదిగల విశ్వరూప మహాసభ సన్నాహక సభ జరిగింది. లింగాల నర్సింహులు అధ్యక్షతన జరిగిన సభలో కూచిపూడి సత్యం మాదిగ, విజయవాడ అర్బన్ ఇన్‌చార్జ్ బయ్యారపు రాజేశ్వరరావు, మంద వెంకటేశ్వర మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## మానవ హక్కులు పరిరక్షించుకోవాలి



క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ప్రతినిధులు

విజయవాడ కల్చరల్: మానవ హక్కులను పరిరక్షించుకోవాల్సిన అవసరముందని నేషనల్ యాంటీ క్రైం అండ్ హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు జాన్ శ్యామూల్ కిమ్ జే అన్నారు. గాంధీనగర్ హనుమంతరాయ మినీ హాల్లో శనివారం సంస్థ ఆధ్వర్యాన ఆవిర్భావ సభ జరిగింది. ఆయన మాట్లాడుతూ సమాజంలో అందరూ సమానమే అన్నారు. కార్యక్రమలో జాతీయ గౌరవ అధ్యక్షుడు మద్దులేటి, జాతీయ గౌరవ కార్యదర్శి గంధం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. సభ్యులు మణిపూర్ దారుణ కాండకు నిరసనగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు.

## విద్యార్థులు ప్రతిభావంతులుగా ఎదగాలి

గుణదల (విజయవాడ తూర్పు): విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తూ, సామాజిక అంశాలపై అవగాహన కలిగి ప్రతిభావంతులుగా ఎదగాలని ప్రభుత్వ స్ట్రాటజిక్ ఎడ్వైజర్ పూతా శివశంకర్‌రెడ్డి అన్నారు. ఆంధ్ర లయోల కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన సమీక్ష-2023 శనివారం ముగిసింది. ముఖ్యఅతిథి శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో పరిస్థితులను ఆకళింపు చేసుకుని ముందుకు సాగాలన్నారు. కేవలం మార్కులే పరమావధిగా కాకుండా నూతన అంశాలను తెలుసుకుంటూ సంఘ సంస్కర్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. కరెంట్ ఎఫైర్స్‌పై దృష్టి సారించి జనరల్ నాలెడ్జ్ పెంచుకోవాలని కోరారు. అనంతరం గౌరవ అతిథి సివిల్ సర్వీసెస్ అధ్యాపకుడు మేడిశెట్టి కల్యాణ్ మాట్లాడుతూ, విద్యార్థులు నూతన అంశాలను నేర్చుకుంటూ నిత్య విద్యార్థిగా ఉండాలన్నారు. డిగ్రీ తర్వాత ఏరంగంలో స్థిరపడినా నైతిక విలువలతో నడుచుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

## • పంద్రాగస్టుకు ఏర్పాట్లు





ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో స్వాతంత్ర్య దినోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలను తెలియజేసే శకటాలను ముస్తాబు చేస్తున్నారు. మార్చ్‌ఫాస్ట్, ఇతర అంశాలపై పోలీసులు ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. ఈ దృశ్యాలను సాక్షి క్లిక్‌మనిపించింది

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ